క్లుప్తంగా

ఎస్టీ సెల్ అధ్యక్షుడి నియామకం

నవాబుపేట: కాంగ్రెస్ పార్టీ ఆదివాసి ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడిగా మండలంలోని కొల్లూర్ తండాకు చెందిన జానునాయక్‌కు నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు బెల్లయ్య నాయక్ ప్రకటించారు. సోమవారం మండల నూతన కమిటీకి నియామకపత్రాలు అందించారు. మండల ఉపాధ్యక్షుడిగా పుల్యానాయక్‌కు నియమించారు.

ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

జడ్చర్ల టౌన్: ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పీఏ భరత్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య మాట్లాడుతూ.. వీఓఏలు సెర్ప్ సంస్థలో 20ఏళ్లుగా పనిచేస్తున్నా కనీస వేతనం ఇవ్వటం లేదన్నారు. గ్రేడింగ్ పద్ధతిలో ఉన్న జీఓ 58ను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఐడీ కార్డులు ఇవ్వాలని, ప్రతి గ్రామ సంఘానికి ల్యాప్‌టాప్ ఇవ్వాలన్నారు. కనీస వేతనం రూ.26వేలు చేయాలన్నారు. కార్యక్రమంలో వసియాబేగం, మంజుల, రమాదేవి, కవిత, సుశీల, భాగ్యమ్మ, లీలావతి, రమేష్, ఆంజనేయులు, భీమయ్య, శ్రీనివాస్, వెంకటయ్య పాల్గొన్నారు.

కరెంట్ సమస్య పరిష్కరించండి



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): దివిటిపల్లి డబుల్ బెడ్రూం కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్య పరిష్కరించాలని డబుల్ బెడ్రూం ఇళ్ల అభివృద్ధి ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి మోహన్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ విజయేందిరకి వినతిపత్రం ఇచ్చారు. కాలనిలో 1,024 ఇళ్లు ఉండగా, అందులో సుమారు 1,200మంది నివాసం ఉంటున్నారని, విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. రోజుకు అనేక సార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, అధికారులకు చెబితే స్పందించడం లేదని తెలిపారు. తక్షణమే శాశ్వత పరిష్కారం చేయాలని కోరారు.

గోశాలకు గోవుల తరలింపు

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురం కురుమూర్తి స్వామికి భక్తులు కానుకలుగా సమర్పించిన గోవులను సోమవారం మహబుబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం చిన్నదర్పల్లి లక్ష్మి గోశాలకు ఆటోలో తరలించారు. గోశాల కాపరి శ్రీనివాసచారి మాట్లాడుతూ గోవుల సంరక్షణ కోసం గోశాలకు తరలిస్తున్నట్లు తెలిపారు.

పీయూలో దాశరథి కృష్ణమాచార్య జయంతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో దాశరథి కృష్ణమాచార్య జయంతిని తెలుగుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అధ్యాపకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. అధ్యాపకుడు రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ కృష్ణమాచార్య నిజాం నిరంకుశత్వాన్ని ప్రశ్నించారని, తెలంగాణ కోటిరతణాల వీణ అని పలికి ప్రజలకు తెలంగాణ గొప్పతనాన్ని చాటిచెప్పారన్నారు. కార్యక్రమంలో తిరుపతయ్య, రాఘవేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కార్లకు బ్లాక్ ఫిల్మ్ తొలగింపు

మహబూబ్‌నగర్ క్రైం: ఎస్పీ ఆదేశాల మేరకు ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో కార్లకు ఉన్న బ్లాక్ ఫిల్మ్‌ను తొలగించారు. పట్టణంలో పలు చౌరస్తాలలో తనిఖీలు చేసి కార్లకు అద్దాలకు వేసుకున్న బ్లాక్ ఫిల్మ్ తొలగిస్తూ వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కార్లకు బ్లాక్ ఫిల్మ్ వేసుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. జిల్లాలో వాహనదారులు ఎవరైనా వారి కార్లకు బ్లాక్ ఫిల్మ్ ఉంటే వెంటనే తొలగించుకోవాలని సూచించారు.

శాఖాపూర్‌లో ద్విచక్రవాహనం చోరీ

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్‌లో ద్విచక్రవాహనం చోరీకి గురైంది. గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ చంద్రశేఖర్ యాదవ్ ఈనెల 19న తన కొత్త బైక్‌ను ఇంటి వద్ద నిలిపి కారులో రాత్రి బయటకు వెళ్లాడు. కొంత సమయం తర్వాత రాత్రే ఇంటికి రాగా బైక్ కనిపించలేదు. దీంతో బాధితుడు ఎక్కడ వెతికినా ఫలితం లేకపోవడంతో సోమవారం అడ్డాకుల పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు రుద్రారంలో 'రైతు నేస్తం'

నవాబుపేట: మండలంలోని రుద్రారంలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి కృష్ణకిశోర్ తెలిపారు. రుద్రారం రైతువేదికలో జరిగే కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు అవగాహ కల్పిస్తారని, రైతులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

మొక్కలు సంరక్షించడం బాధ్యత

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- 21వ వార్డులో ప్రజలకు మొక్కల పంపిణీ
- మూడు వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శేషాద్రినగర్‌లో ప్రజలకు మొక్కలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక 21వ వార్డులోని బీకేరెడ్డికాలనీ, శేషాద్రినగర్ వాసులకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఉచితంగా మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిత్యజీవితంలో మనకు చెట్లు ఎన్నో రకాలుగా ఉపయోగపడుతాయన్నారు. ఇంటింటా పచ్చని మొక్కలు నాటి ఆరోగ్యాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం కాలనీలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్‌తో కలిసి మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, కౌన్సిలర్లు రాణి, శ్రీనివాసులు, చిన్నంగారి తిరుపతమ్మ, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, ఎంఈ బస్వరాజ్, డీఈఈ యూనుస్, ఏఈ వైష్ణవి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్, చంద్రకుమార్‌గౌడ్, రాజు, మనోహర్, అంజి, జలీల్, భరత్‌కుమార్, నాగరాజు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు, డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన

అలాగే పదో వార్డులోని క్రిస్టియన్‌పల్లిలో సీసీరోడ్డు, 11, 23వ వార్డుల పరిధిలోని పాతపాలమూరులో రెండు చోట్ల డ్రెయినేజీ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం శిథిలావస్థకు చేరుకున్న వెంకటేష్ ఇంటిని పరిశీలించారు. వెంటనే సురక్షిత ప్రాంతానికి వెళ్లాలని బాధితుడికి సూచించారు. కాలనీ ప్రజలతో స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

మదర్సా ఇస్లామియాను సందర్శించిన ఎమ్మెల్యే

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని మదర్సా ఇస్లామియా కాశిఫుల్ ఉలుమ్ పాఠశాలను సోమవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. విద్యార్థులకు కావాల్సిన బెంచీలు, నోటుబుక్కులు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఈద్గా కమిటీ ప్రతినిధి నూరుల్ హసన్ తన నివాసంలో ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హాదీ, అబ్దుల్ జకీ, రఫీక్ పటేల్, పీర్ సాధిక్, అవేజ్ అహ్మద్, అలీం తదితరులు పాల్గొన్నారు.

బోయపల్లి పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మండలంలోని బోయపల్లి పాఠశాలలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దాతలు సేవలో భాగంగా విద్యార్థులకు ఉపయోగపడే కంప్యూటర్ ల్యాబ్ నిర్మించడం గొప్ప విషయం అన్నారు. గ్రామాల్లో ఉన్న పాఠశాలల్లో కూడా విద్యార్థులకు ఉపయోగపడేందుకు దాతలు, ప్రజలు ముందుకు వచ్చి వసతులు కల్పించాలని సూచించారు. రానున్న రోజుల్లో పాలమూరును ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కంప్యూటర్ ల్యాబ్ దాతను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో డీఈఓ రవీందర్, కౌన్సిలర్ మోతీలాల్, ఎంఈఓ జయశ్రీ, వినోద్‌కుమార్, అబ్దుల్‌హక్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ సహకారంతోనే దేవరకద్ర అభివృద్ధి



రావులపల్లి చెక్‌డ్యాంలో పూలు చల్లుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్: మాజీ సీఎం కేసీఆర్ సహకారంతోనే దేవరకద్ర నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రావులపల్లి వద్ద చెక్‌డ్యాంలో నీరు పారుతుండగా మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌తో కలిసి పూజలు చేసి పూలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్‌కు మహబూబ్‌నగర్, దేవరకద్ర నియోజకవర్గం మీద అభిమానం ఉందన్నారు. నియోజకవర్గంలో రూ.కోట్లు ఖర్చు చేసి 30 చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టామని, నీటితో నేడు కళకళలాడుతున్నాయని అన్నారు. చెక్‌డ్యాంలో నీటితో పారుతుంటే చాలా ఆనందంగా ఉందన్నారు. కర్వెన ప్రాజెక్టు పూర్తయితే మరింత సస్యశ్యామలంగా మారుతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, శ్రీనివాస్, కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఆగిరి సత్యం పాల్గొన్నారు.

పలువురు అధికారుల బదిలీ



నరేందర్‌రెడ్డి, ఎంపీఈఓ



ప్రత్యేకాధికారిని సన్మానిస్తున్న అధికారులు

గండేడ్: ఉమ్మడి గండేడ్ మండల ఎంపీఈఓగా నరేందర్ రెడ్డి నియామకమయ్యారు. ఇక్కడ పనిచేసిన ఎంపీఈఓ శంకర్‌నాయక్ 2019లో గండీడ్‌కు వచ్చారు. ఇటీవల బదిలీల్లో భాగంగా ఆయన మహబూబ్‌నగర్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో మహబూబ్‌నగర్ ఎంపీఈఓగా పనిచేసిన నరేందర్‌రెడ్డి వచ్చారు. ఈమేరకు ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు సైతం పలుచోట్లకు బదిలీ అయ్యారు. కంచన్‌పల్లి పంచాయతీ కార్యదర్శి సభద్ర హన్వాడకు, వెన్నాచేడ్ పంచాయతీ కార్యదర్శి బాలర్‌నగర్ బొట్లుగడ్డ తండాకు బదిలీ అయ్యారు. పంచాయతీ కార్యదర్శి మంగమ్మ ముందలితండా నుంచి రాజాపూర్, పూర్ణిమ ఎలికచెరువు తండా నుంచి జడ్చర్ల, రాధ కొండాపూర్ నుంచి నసురుల్లాబాద్‌తండా, శశికళ గండేడ్ నుంచి పారుపల్లి, నీలమ్మ అంచన్‌పల్లి నుంచి గొండ్యాలకు, ప్రవళిక ధర్మాపూర్ నుంచి వెంకట్‌రెడ్డిపల్లి, వెంకటేష్ రుసుంపల్లి నుంచి పెద్దవార్వాల్, ఉమాదేవి మొకర్లాబాద్ నుంచి అంచన్‌పల్లి, చెన్నకేశవులు జూలపల్లి నుంచి కొండాపూర్, వెంకటమ్మ వెంకట్‌రెడ్డిపల్లి నుంచి మొకర్లాబాద్, ఉమాదేవి అన్నారెడ్డిపల్లి నుంచి ముందలితండా, మణెమ్మ మన్సూర్‌పల్లితండా నుంచి ఎల్కిచెరువుతండా, శివరాజ్‌యాదవ్ హన్వాడ నుంచి కంచన్‌పల్లి, మల్లికార్జున్ మహబూబ్‌నగర్ నుంచి ధర్మాపూర్, జ్ఞానేశ్వర్ హన్వాడ నుంచి అన్నారెడ్డిపల్లి పంచాయతీలకు బదిలీ అయ్యారు. ఖాళీ అయిన వెన్నాచేడ్, గండేడ్, మన్సూర్‌పల్లి, జూలపల్లి, రుసంపల్లి, నంచర్ల పంచాయతీ కార్యదర్శుల పోస్టులు భర్తీ కాలేదు.

గండేడ్ ప్రత్యేకాధికారిగా ఛత్రునాయక్

గండేడ్: మండల ప్రత్యేకాధికారిగా డీటీడబ్ల్యూఓ ఛత్రునాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇదే స్థానంలో పనిచేస్తున్న డీడీ పాండు ఇటీవల బదిలీల్లో మేడ్చల్ జిల్లాకు వెళ్లారు. గండేడ్‌తో పాటు మహమ్మదాబాద్‌కు ఉమ్మడి మండలాల బాధ్యతలను ఆయన నిర్వర్తించనున్నారు. అదేవిధంగా మహమ్మదాబాద్ జెడ్పీహెచ్‌ఎస్‌లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ సుదర్శన్ ఎంపీడీఓకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ దేవన్న, సూపరింటెండెంట్ ప్రతాప్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సత్యయ్య తదితరులు వారిని శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): విద్యాహక్కు చట్టం తప్పకుండా ప్రతి ప్రైవేట్ పాఠశాలలో అమలయ్యేలా చూడాలని సేవాలాల్ ఆలయ కమిటీ సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాహక్కు చట్టం ద్వారా ప్రతి ప్రైవేట్ స్కూల్లో పేద విద్యార్థులకు 25 శాతం ఫ్రీ సీట్లు కేటాయించాలని కోరారు. గిరిజన రిజర్వేషన్లు స్థానిక ఎన్నికల్లో రాష్ట్రాన్ని క్లస్టర్‌గా కాకుండా ఒక జిల్లాని క్లస్టర్‌గా చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో గిరిజనులపై దాడులు, లైంగికదాడులు అరికట్టేందుకు చర్యలను చేపట్టారు. కార్యక్రమంలో రాము నాయక్, ప్రతాప్‌నాయక్, రమేష్ నాయక్, కిషన్ పవర్, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు

అడ్డాకుల: కరెంట్ షాక్‌తో చనిపోయిన వానరానికి యువకులు అంత్యక్రియలు మండల కేంద్రంలో సోమవారం నిర్వహించారు. నాలుగు రోజుల కిందట ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వానరం స్తంభంపైకి ఎక్కగా షాక్‌కు గురైంది. వానరం కళ్లు, ఇతర భాగాలు దెబ్బతిన్నాయి. కొందరు గ్రామస్తులు వానరానికి పశువైద్యుడితో చికిత్స చేయించారు. సోమవారం చనిపోవడంతో అంత్యక్రియలు నిర్వహించారు.

ఆర్టీసీ అభివృద్ధికి బడ్జెట్ కేటాయించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ కార్పొరేషన్, కార్మికుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని అల్ ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా సోమవారం ప్రకటనలో తెలిపారు. గ్రీవెన్స్ ద్వారా ప్రధానమంత్రి, తెలంగాణ ముఖ్యమంత్రికి వినతిపత్రం పంపించినట్లు తెలిపారు. ఆర్టీసీ కార్మికులకు ఆదాయపు, ఇతర పన్నులను మినహాయించాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆర్టీసీలో ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు 2017 పీఆర్‌సీ బకాయిలు నగదు రూపంలో చెల్లించాలని, 2021 పీఆర్‌సీ అమలు చేయాలని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆర్టీసీ కార్మికుల విలీన ప్రక్రియను త్వరగా పూర్తిచేసి కార్మికులకు అండగా నిలబడాలని కోరారు.

టీచర్స్‌కాలనీలో డెంగీ కేసు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 8వ వార్డు పరిధిలోని టీచర్స్‌కాలనీకి చెందిన ఒకరికి డెంగీ సోకింది. సోమవారం ఇంటి పరిసరాల్లో మున్సిపల్ సిబ్బంది బ్లీచింగ్ పౌడర్ చల్లి రసాయాలు పిచికారీ చేశారు.

గిరిజన కవలల ప్రతిభ

రాజాపూర్ (బాలానగర్): బాలానగర్ మండలంలోని పల్లుమీదితండాకు చెందిన హతిరాం, అంజి దంపతుల కవలలు అర్జున్, కరణ్ తమ ప్రతిభను చాటారు. 8ఏళ్ల క్రితం తండ్రి ప్రమాదంలో మృతి చెందగా, తల్లి ఇద్దరిని కష్టపడి చదివించింది. ఈ క్రమంలో కరన్ ట్రిపుల్ ఐటీ ఉత్తర్‌ప్రదేశ్‌లోని జబాల్‌పూర్‌లో ఎంపిక కాగా, అర్జున్ ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని రూర్కిలో ఐఐటీకి ఎంపికయ్యారు. కౌన్సెలింగ్‌లో ఆ ఇద్దరికి సీటు రావడంతో తండావాసులు అభినందించారు.

ఉర్సును ఘనంగా నిర్వహిస్తాం



మాట్లాడుతున్న సైఫొద్దీన్ ఖాద్రీ

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం రామయ్యబౌలీలో ఈనెల 26వ తేదీన హజ్రత్ షేక్ రఫియోద్దీన్‌షా ఖాద్రీ దర్గా, హజ్రత్ షేక్ అబ్దుల్ రహెమాన్ హుస్సేన్‌షా ఖాద్రీ షర్ఫీ ఉర్సును నిర్వహిస్తున్నట్లు ముతవల్లీ షైక్ సైఫొద్దీన్ ఖాద్రీ వెల్లడించారు. జిల్లా కేంద్రం రామయ్యబౌలీలోగల కమ్యూనిటీహాల్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆ రోజు రాత్రి 7 గంటలకు గంధోత్సవం ఉంటుందని, 8 గంటలకు అల్మాస్ ఫంక్షన్‌హాల్‌లో 9వ ధార్మికసభ ఉంటుందని తెలిపారు. వేడుకల్లో హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ రఫియోద్దీన్ హుస్సేని, మహ్మద్ మహమూద్ హుస్సేని, కాజం మొహియోద్దీన్, మహ్మద్ అబ్దుల్ మొయిజ్, అబ్దుల్ మొహిమిన్, ఇస్తెకార్, కర్నూల్‌కు చెందిన హుస్సేనీ పీర్ హుస్సేని తదితర ధార్మికవేత్తలు పాల్గొని సందేశాలు ఇస్తారని తెలిపారు. సమావేశంలో సాదుల్లా, ఇబ్రాహీం నక్షబంది, జహంగీర్‌పాష ఖాద్రీ, మహ్మద్ మజహర్ షరీఫ్, ఖాదర్ షరీఫ్, సయ్యద్ అఖిల్, ఆసిఫ్ షర్ఫీ, మహ్మద్ సోహేల్, ఓవేజ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమా దరఖాస్తుల స్వీకరణ



రాజాపూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ నరేందర్

రాజాపూర్: కొత్తపట్టాదారు రైతులకు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి నరేందర్ సూచించారు. సోమవారం మండల శివారులోని రైతుకేంద్రంలో ఆయన రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జూన్ 28 వరకు పట్టా పాస్‌బుక్కులు వచ్చిన రైతులు ఇంత వరకు బీమా చేయించుకోని వారు మాత్రమే ఆగస్టు 5లోపు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చిన్నచింతకుంట: కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాజేష్‌ఖన్న ప్రకటనలో తెలిపారు. పాసుపుస్తకం, ఆధార్ కార్డు, నామిని ఆధార్‌కార్డు, జిరాక్స్‌లతో మండల వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇది వరకు బీమా చేసుకున్న రైతులు తమ పేర్లను మార్పులు చేర్పులు చేసుకోవచ్చని తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి



బాలానగర్‌లో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్ (బాలానగర్): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధి, ప్రజాసంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం బాలానగర్ మండల కేంద్రంలో పలుగ్రామాలకు చెందిన 94 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పదేళ్లు గుంతలరోడ్లపై ప్రయాణం చేసిన ప్రజలు ఇబ్బందులు పడ్డారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే బాలానగర్, రాజాపూర్ మండలాల్లోని గ్రామాలకు రూ.86 కోట్ల నిధులతో బీటీరోడ్లు మంజూరు చేయించానని వాటికి శంకుస్థాపన చేసుకున్నామని గుర్తు చేశారు. విద్యుత్ సమస్య పరిష్కారంకోసం రంగారెడ్డిగూడతో పాటు నియోజకవర్గంలోని గ్రామాల్లో సబ్‌స్టేషన్‌లు కూడా మంజూరు చేయించామన్నారు. అనంతరం రంగారెడ్డిగూడలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం చేసేందుకు స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, రాజాపూర్ తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్, ఎంపీఓ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: మండలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను సోమవారం మండల కేంద్రంలో నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. చందన రూ.21వేలు, కృష్ణయ్య రూ.45వేలు, శివుడు రూ.21వేలు, లింగమయ్య రూ.18వేలు, పెద్ద ఆంజనేయులు రూ.60వేల చెక్కులను అందజేశారు ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, గౌస్, వెంకటయ్య, నర్సింహ, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

టీఎల్‌ఎం ద్వారా పాఠాల బోధన



టీఎల్‌ఎం మెటీరియల్‌ను పరిశీలిస్తున్న ఏఎంఓ శ్రీనివాస్

భూత్పూర్: ఉపాధ్యాయులు టీచింగ్, లెర్నింగ్, మెటీరియల్ ద్వారా పాఠాలు బోధించాలని ఏఎంవో శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మున్సిపాలిటీలోని అమిస్తాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ప్రభుత్వం పిల్లల విద్యాభివృద్ధికి రూ.లక్షలు ఖర్చు చేస్తుందని, పాఠశాలలో ఉన్న వసతుల ద్వారా పిల్లలకు పాఠాలు బోధించాలన్నారు. పాఠశాలల్లో ఉన్న పరికరాలను, పని తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగయ్య, సీఆర్పీ ఠాగూర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిక్షాసప్తాహ్ వారోత్సవాలు ప్రారంభం

జడ్చర్ల టౌన్: జాతీయ విద్యావిధానం నాల్గవ వార్షికోత్సవం పురస్కరించుకుని శిక్ష సప్తాహ్ ప్రత్యేక కార్యక్రమం సోమవారం పట్టణంలో నిర్వహించారు. పట్టణంలోని ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ మంజులాదేవి సందర్శించారు. విద్యార్థులచే టీఎల్‌ఎం ప్రదర్శింపజేశారు. అనంతరం కావేరమ్మపేట ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించారు. కార్యక్రమాల్లో పాఠశాలల హెచ్‌ఎంలు చంద్రకళ, మధుసూదన్‌గౌడ్, ఉపాధ్యాయులు పుష్పలత, వెంకటయ్య, శ్రీలత, వర్ష, పద్మ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు సన్మానం



రుద్రారంలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

నవాబుపేట: ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైందని ఎంఈఓ రాజునాయక్ తెలిపారు. సోమవారం మండలంలోని రుద్రారం ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీఆర్పీ జనార్దన్, మాజీ సర్పంచ్‌లు లలితమ్మ, వెంకటేశ్వర్‌రెడ్డి, లక్ష్మి, కృష్ణగౌడ్, యాదయ్య, మధుసూదన్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, రవి తదితరులు ఉన్నారు.

మిడ్జిల్: మండల పంచాయతీ అధికారి అనురాధ, సూపరింటెండెంట్ విజయ్‌భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ కిషన్‌రావు బదిలీకావడంతో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వారిని ఘనంగా సన్మానించారు. కొత్తగా వచ్చిన ఆనంద్, చెన్నారెడ్డిలను సన్మానించారు. ఎంపీడీఓ గీతాంజలి, మాజీ ఎంపీటీసీలు గౌస్, నర్సింహ, నాయకులు అల్వాల్ రెడ్డి, వెంకటయ్య, సత్యం, పర్వతాలు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం



ఇబ్రహీంనగర్ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న అధికారులు

కోయిల్‌కొండ: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉందని ఎంపీడీఓ కాశప్ప అన్నారు. సోమవారం మండలంలోని ఇబ్రహీంనగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో శిక్షాసప్త కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. విద్యార్థులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్‌నాయక్, ఏపీఓ నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎడతెరపి లేని వర్షాలకు కూలిన ఇల్లు



కొత్లాబాద్‌లో కూలిన ఇంటి వద్ద ఖాజన్నగౌడ్



మిడ్జిల్‌లో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు

కోయిల్‌కొండ: మండలంలోని కొత్లాబాద్‌లో రైతు ఖాజన్నగౌడ్‌కు చెందిన ఇల్లు కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. ప్రభుత్వం స్పందించి ఖాజన్న కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకొని ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు.

శిథిలావస్థకు చేరిన ఇళ్లను ఖాళీ చేయండి

మిడ్జిల్: మండలంలో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండడంతో శిథిలావస్థకు చేరిన ఇళ్లు కూలే ప్రమాదం ఉందని సోమవారం తహసీల్దార్ రాజు నాయక్, ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. మండల కేంద్రంలో శిథిలావస్థలో ఉన్న మాల జంగయ్య, మాల యాదమ్మ, ఆటో శివయ్య, బరిగెల జంగయ్య ఇళ్లలో ఎవరూ రాత్రి వేళ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇళ్లను ఖాళీ చేయాలని సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి

చిన్నచింతకుంట: కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కృష్ణయ్య సూచించారు. శనివారం తహసీల్దార్ మాట్లాడుతూ మట్టి మిద్దెలు, గుడిసేలలో నివాసం ఉంటున్న ప్రజలు ప్రభుత్వ భవనాలు పంచాయతీ, కమ్యూనిటీ హాల్, ప్రభుత్వ పాఠశాలల్లోని సురక్షిత ప్రాంతాలలోకి చేరాలన్నారు.

అధ్వాన్నంగా రహదారులు

జడ్చర్ల టౌన్: కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు అధ్వానంగా మారాయి. బండమీదిపల్లి నుంచి వల్లూరుకు వెళ్లే రోడ్డు గుంతలు పడి బురదమయంగా మారింది. మండలంలోని బూర్గుపల్లి బీసీ కాలనీలోనూ రోడ్డు దెబ్బతింది. మండలంలోని ఉదండాపూర్ గ్రామంలో ఓ ఇల్లు కూలింది. దీంతో సోమవారం పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు వెళ్లి ఇంట్లో ఉన్న వారిని సురక్షిత ప్రాంతానికి వెళ్లాలని సూచించారు. పట్టణంలోని సిగ్నల్‌గడ్డపై రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతుండటంతో వర్షానికి గతుకులమయంగా మారింది.

అంగన్‌వాడీ కేంద్రం తరలింపు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు స్థానిక 15వ వార్డు పరిధిలోని చిన్నదర్‌పల్లిలో ఓ అంగన్‌వాడీ కేంద్రం కురుస్తోంది. ఇది కొన్నాళ్లుగా ఓ పాత అద్దె భవనంలో కొనసాగుతోంది. అక్కడికి ప్రతిరోజూ కనీసం ఐదుగురు చిన్నారులు వస్తుంటారు. సోమవారం మున్సిపల్ వార్డు సూపర్‌వైజర్ అహ్మద్ షరీఫ్, వార్డు ఆఫీసర్ శివరాజ్ ఆధ్వర్యంలో తాత్కాలికంగా సమీపంలోని పీర్ల మసీదు వద్దకు తరలించారు.

ఖాతా నుంచి డబ్బులు మాయం

జడ్చర్ల: తన మొబైల్ ఫోన్‌కు వచ్చిన లింక్‌ను ఓపెన్ చేయగా బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బులు మాయం అయ్యాయని బాధితుతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ఆదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిషా రాష్ట్రానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి అనిల్‌కుమార్‌బిస్వాల్ స్థానిక శ్రీనివాసకాలనీలో నివాసం ఉంటున్నాడు. ఏప్రిల్ 4న అతని ఫోన్‌కు యోనో ఎస్‌బీఐ రివార్డ్స్ పాయింట్స్ పేరుతో ఒక లింక్ మెసేజ్ వచ్చింది. దానిని ఓపెన్ చేసి వివరాలు నమోదు చేస్తుండగానే ఎస్‌బీఐ ఖాతా నుంచి ఓటీపీ వచ్చిన ఐడీ ద్వారా రూ.27,999 డ్రా అయ్యాయి. వెంటనే సైబర్‌క్రైంకు ఫిర్యాదు చేయగా వారు గుర్తించి డబ్బులను హోల్డ్‌లో ఉంచినట్లు బాధితుడి ఫోన్‌కు సమాచారం పంపారు. దీంతో బాదితుడు సోమవారం తమకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.